సాక్షి నల్లగొండ

మంగళవారం । 29 । ఆగస్టు । 2023



హత్య చేయించింది..
మోతెకు చెందిన పీఈటీ వెంకటాచారిని అదే గ్రామానికి చెందిన మరో ఉపాధ్యాయుడు హత్య చేయించాడు. - 8లో



వంద రోజుల్లో కాంగ్రెస్..
రాష్ట్రంలో మరో వంద రోజుల్లో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడబోతోందని నల్లగొండ ఎంపీ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. - 10లో



ఆకట్టుకున్న చిత్రపటం
అనాజిపురంలో వ్యవసాయ యూనివర్సిటీ విద్యార్థులు వేసిన గ్రామీణ సామాజిక చిత్ర పటం ఆకట్టుకుంది. - 10లో

న్యూస్‌రీల్

1 నుంచి ప్రజా సమస్యలపై నిరసనలు



మాట్లాడుతున్న జూలకంటి రంగారెడ్డి

మిర్యాలగూడ : ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ వచ్చే 1 నుంచి 10వ తేదీ వరకు నిరసన కార్యక్రమాలు చేపట్టనున్నట్లు మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి తెలిపారు. సోమవారం స్థానిక సీపీఎం కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర, జిల్లా, డివిజన్, మండల స్థాయిల్లో నిరసనలు చేపట్టాలని పిలుపునిచ్చారు. నిత్యావసర ధరలు రోజురోజుకు పెరుగుతుండడంతో సామాన్యులు జీవించలేని పరిస్థితులు నెలకొన్నాయని పేర్కొన్నారు. సెప్టెంబర్ 17న తెలంగాణ విలీన దినోత్సవంగా ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని తీర్మానించారు. ఎంతో మంది త్యాగాల ఫలితంగా తెలంగాణ రాజ్యాన్ని దేశంలో విలీనం చేశారని, అందులో ఎంతో మంది హిందువులు, ముస్లింలు ప్రాణత్యాగాలు చేశారని, కాని కొన్ని మతతత్వ పార్టీలు తమకు అనుకూలంగా మార్చుకునేందుకు ప్రయత్నాలు చేస్తున్నాయని విమర్శించారు. సమావేశంలో సీపీఎం నాయకుడు వీరేపల్లి వెంకటేశ్వర్లు, మల్లు గౌతంరెడ్డి, పాండు, మంగారెడ్డి, రామ్మూర్తి, రాంరెడ్డి, భిక్షం, రామరావు పాల్గొన్నారు.

నేటి నుంచి రాష్ట్రీయ ఏక్తా పర్వ్

రామగిరి(నల్లగొండ) : నల్లగొండ కేంద్రీయ విద్యాలయంలో మంగళవారం నుంచి కేవీఎస్ రాష్ట్రీయ ఏక్తా పర్వ్, కళా ఉత్సవ్ ప్రారంభమవుతుందని ప్రిన్సిపాల్ జి.శ్రీనివాసులు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆగస్టు 29 నుంచి 31 వరకు మూడు రోజుల పాటు విద్యార్థులకు వివిధ పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ పోటీల్లో రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి 9 కేంద్రీయ విద్యాలయ నుంచి విద్యార్థులు పాల్గొంటారని పేర్కొన్నారు. పోటీల్లో గెలుపొందిన వారిని జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక చేయనున్నట్లు తెలిపారు.

కొబ్బరికాయల విక్రయానికి వేలం



వేలం నిర్వహిస్తున్న అధికారులు

నార్కట్‌పల్లి : ఎల్లారెడ్డిగూడెం గ్రామ పంచాయతీ ఎదురుగా చెర్వుగట్టుకు వెళ్లే ఆర్చి ఆవరణలో కొబ్బరికాయల విక్రయానికి సోమవారం డీఎల్‌పీఓ లక్ష్మినారాయణ, ఎంపీఓ సత్యనారాయణ వేలం నిర్వహించారు. ఈ వేలంలో ఎల్లారెడ్డిగూడెం గ్రామానికి చెందిన శంకరయ్య రూ.50 లక్షలు దక్కించుకున్నారు.

గత టెండర్‌దారుడికి నోటీస్..
గత సంవత్సరం ఇదే గ్రామానికి చెందిన మాదగోని గోపాల్ కొబ్బరికాయల విక్రయాన్ని రూ.45 లక్షలకు దక్కించుకొని సంవత్సరం పూర్తయినా రూ.16 లక్షలు గ్రామ పంచాయతీకి చెల్లించలేదు. దీంతో డీఎల్‌పీఓ లక్ష్మీనారాయణ గోపాల్‌కు నోటీస్ జారీ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ మేడి పుష్పలతశంకర్, ఉప సర్పంచ్ వడ్డె భూపాల్‌రెడ్డి, ఇల్లందుల కిట్టు, వరికుప్పల యాదగిరి, సూర అశోక్, దండు జగన్, మేడి రమేష్, చిక్కుల శివ, పనస సతీష్, రాంబాబు, స్వామి, శేఖర్ ఉన్నారు.

అవార్డులకు ప్రతిపాదనలు పంపాలి

నల్లగొండ : సెప్టెంబర్ 5వ తేదీన ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా జిల్లాస్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు కోసం ఉపాధ్యాయులు ఎంఈఓలకు ఈనెల 31లోగా ప్రతిపాదనలు సమర్పించాలని డీఈఓ భిక్షపతి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతిపాదనలు పరిశీలించేందుకు కలెక్టర్ ఆర్‌వీ.కర్ణన్ మండల స్థాయి కమిటీని నియమించారని పేర్కొన్నారు. చైర్మన్‌గా తహసీల్దార్, సభ్యులుగా మండల పరిషత్ అభివృద్ధి అధికారి, మండల విద్యాధికారులు సభ్యులుగా కన్వీనర్‌గా కొనసాగుతారని తెలిపారు. వీరు మండల స్థాయిలో వచ్చిన ప్రతిపాదనలు పరిశీలించి జిల్లాస్థాయి అవార్డుల కోసం పంపుతారని పేర్కొన్నారు.

కిక్ బాక్సింగ్‌లో మర్రిగూడ వాసికి సిల్వర్ మెడల్స్

మర్రిగూడ : మండల కేంద్రానికి చెందిన పంతంగి వేద ఆదివారం జార్ఖండ్ రాష్ట్రంలోని రాంచీలో జరిగిన నేషనల్ కిక్ బాక్సింగ్ పోటీల్లో గెలుపొంది రెండు సిల్వర్ మెడల్స్ సాధించింది. ఈ సందర్భంగా ఆమెను పలువురు అభినందించారు.

12 నియోజకవర్గాలు.. 94 మంది

టికెట్ ఎవరి 'చేతి'కో?

కాంగ్రెస్ పార్టీలో భారీగా ఆశావహుల దరఖాస్తులు

- అత్యధికంగా మిర్యాలగూడ నుంచి 18 మంది
- ఆ తరువాత స్థానంలో ఆలేరు, తుంగతుర్తి
- ఇద్దరు ఎంపీలు సైతం దరఖాస్తు
- దరఖాస్తు చేయని జానారెడ్డి



సాక్షి ప్రతినిధి, నల్లగొండ: ఎన్నికల సమరానికి కాంగ్రెస్ నాయకులు రెడీ అవుతున్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేయాలనుకునే వారు దరఖాస్తు చేసుకోవాలని కాంగ్రెస్ పార్టీ ప్రకటించడంతో ఉమ్మడి జిల్లా నుంచి పెద్ద ఎత్తున ఆశావహులు దరఖాస్తు చేసుకున్నారు. 12 నియోజకవర్గాల పరిధిలో 94 మంది దరఖాస్తులు సమర్పించారు. అందులో ఎవరికి టికెట్ లభిస్తుందో.. ఎవరికి నిరాశ ఎదురవుతుందో త్వరలోనే తేలనుంది.

మూడు నియోజకవర్గాల్లో అధిక పోటీ
బీఆర్‌ఎస్ పార్టీ ఇప్పటికే అభ్యర్థులను ప్రకటించింది. వారిపై పోటీ చేసేందుకే ఉమ్మడి జిల్లాలోని ఆయా నియోజకవర్గాల నుంచి పోటీ చేసేందుకు ఉత్సాహం చూపుతూ కాంగ్రెస్ పార్టీ నుంచి దరఖాస్తు చేసుకున్నారు. ఈ నెల 25వ తేదీ దరఖాస్తులకు చివరి గడువు కావడంతో ఆరోజు వరకు ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని 12 నియోజకవర్గాల నుంచి 94 మంది దరఖాస్తు చేసుకున్నారు. వారిలో కొందరు నేరుగా వెళ్లి దరఖాస్తు చేసుకోగా, మరి కొందరు తమ తరఫున ఇతరులను పంపించి గాంధీ భవన్‌లో దరఖాస్తు చేయించారు. వారిలో నల్లగొండ జిల్లా నుంచి 40 మంది, సూర్యాపేట జిల్లా నుంచి 29 మంది, యాదాద్రి జిల్లా నుంచి 25 మంది దరఖాస్తు చేసుకున్నారు. అందులో మూడు నియోజకవర్గాల్లో టికెట్ కావాలంటూ దరఖాస్తు చేసిన వారి సంఖ్య పది దాటిపోయింది. అత్యధికంగా మిర్యాలగూడ నియోజకవర్గం నుంచి 18 మంది దరఖాస్తు చేసుకోగా.. ఆలేరు నుంచి పోటీచేసేందుకు 16 మంది ఉత్సాహం కనబరిచారు. ఎస్సీ రిజర్వుడ్ నియోజకవర్గం అయిన తుంగతుర్తి నుంచి 15 మంది దరఖాస్తు చేసుకున్నారు.

దరఖాస్తుల వివరాలు ఇవీ..

నియోజకవర్గం	దరఖాస్తుల సంఖ్య
నల్లగొండ	5
నకిరేకల్	6
మునుగోడు	3
దేవరకొండ	7
మిర్యాలగూడ	18
నాగార్జునసాగర్	1
సూర్యాపేట	5
తుంగతుర్తి	15
హుజూర్‌నగర్	4
కోదాడ	5
ఆలేరు	16
భువనగిరి	9
మొత్తం	94

వీరేశం వస్తారా.. మరెవరికైనా ఇస్తారా?

బీఆర్‌ఎస్ నుంచి మాజీ ఎమ్మెల్యే వేముల వీరేశం టికెట్ ఆశించినా అధిష్టానం ఇవ్వకపోవడంతో ఆయన కాంగ్రెస్ పార్టీలో చేరతారన్న ప్రచారం సాగింది. అయితే, ఇప్పటివరకు ఆయన అధికారికంగా ఎలాంటి ప్రకటన చేయలేదు. గత ఎన్నికల్లో కాంగ్రెస్ నుంచి గెలిచిన ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య బీఆర్‌ఎస్‌లో చేరారు. ఆయన ఇప్పుడు బీఆర్‌ఎస్ నుంచి పోటీ చేయబోతున్నారు. ఈ నేపథ్యంలో ఇక్కడ కాంగ్రెస్‌పార్టీ ఎవరిని పోటీలో ఉంచుతుందన్నది ఆసక్తికరంగా మారింది.

దరఖాస్తుదారుల్లో ముఖ్య నేతలు
కాంగ్రెస్ పార్టీ నుంచి అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసేందుకు టికెట్ కావాలంటూ ఉమ్మడి జిల్లాకు చెందిన ముఖ్య నేతలు కూడా దరఖాస్తు చేశారు. నల్లగొండ ఎంపీ ఉత్తమ్‌కుమార్ హుజూర్‌నగర్ నుంచి పోటీ చేసేందుకు దరఖాస్తు చేసుకోగా, భువనగిరి ఎంపీ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి నల్లగొండ నుంచి పోటీ చేసేందుకు దరఖాస్తు చేసుకున్నారు. సూర్యాపేట నుంచి మాజీ మంత్రి రాంరెడ్డి దామోదర్‌రెడ్డి దరఖాస్తు చేసుకున్నారు. ఇక మాజీ మంత్రి కుందూరు జానారెడ్డి ఏ నియోజకవర్గం నుంచి కూడా దరఖాస్తు చేసుకోలేదు. ఆయన తనయులు జైవీర్‌రెడ్డి నాగార్జునసాగర్ నుంచి, రఘువీర్‌రెడ్డి మిర్యాలగూడ నుంచి టికెట్ ఆశించి దరఖాస్తు చేసుకున్నారు.

సీనియర్లను కాదని ఇచ్చేనా?
ఉమ్మడి జిల్లాలోని సీనియర్ నాయకులు, గతంలో పోటీ చేసిన వారిని కాదని కొత్త వారికి టికెట్ కేటాయిస్తారా? లేదంటే పాత వారికే ఇస్తారా? అన్నది తేలాల్సి ఉంది. ఎన్నికల్లో బీఆర్‌ఎస్ నుంచి పోటీలో ఉండే అభ్యర్థులను దీటుగా ఎదుర్కొనే వారికే టికెట్లను కేటాయిస్తారా? అన్నది కాంగ్రెస్ పార్టీ ఎన్నికల కమిటీ తేల్చాల్సి ఉంది. గత ఎన్నికల్లో పోటీ చేసిన వారు ఇప్పుడు కూడా టికెట్లను అడుతున్నారు. నల్లగొండలో ఎంపీ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డిని కాదని మరొకరికి టికెట్ ఇచ్చే అవకాశం ఉంటుందా? అంటే కష్టమేనన్న వాదన పార్టీ వర్గాల నుంచి వ్యక్తమవుతోంది. సూర్యాపేటలోనూ అదే పరిస్థితి నెలకొంది. మునుగోడులో ఎవరికి ఇస్తారన్నది ఆసక్తికరంగా మారింది. ఉప ఎన్నికల్లో పోటీ చేసి ఓడిపోయిన స్రవంతికి ఇస్తారా? ఆ ఎన్నికల నాటి నుంచే టికెట్ ఆశిస్తున్న చలమల్ల కృష్ణారెడ్డికి టికెట్ ఇస్తారా? ఒక వేళ కమ్యూనిస్టులతో పొత్తు కుదిరితే వారికి కేటాయిస్తారా అన్నది తేలాల్సి ఉంది. ఇక హుజూర్‌నగర్‌లో ఎంపీ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి టికెట్ ఆశించి మొదటి నుంచి పనిచేసుకుంటున్నారు. అక్కడ కూడా ఆశావహులు దరఖాస్తు చేశారు. మరోవైపు కోదాడ నుంచి పద్మావతి రెడ్డి టికెట్ ఆశిస్తున్నారు. అయితే ఒకే కుటుంబంలో ఇద్దరికి వస్తుందా? ఒక్కరికే ఇచ్చేలా ఒప్పించే ప్రయత్నం చేస్తుందా? వేచి చూడాలి. ఇక భువనగిరి నుంచి గతంలో పోటీ చేసి ఓడిపోయిన కుంభం అనిల్ రెడ్డి ఇప్పుడు బీఆర్‌ఎస్‌లో చేరారు. అక్కడ ఎవరికి ఇస్తారనేది వేచి చూడాల్సింది.



వెంబావిలో బస్‌షెల్టర్ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేస్తున్న శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, నకిరేకల్ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య

రాష్ట్ర పథకాలను కాపీ కొడుతున్న కేంద్రం

- శాసన మండలి చైర్మన్ సుఖేందర్‌రెడ్డి
- చిట్యాల మండలంలో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన

చిట్యాల : తెలంగాణలో అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను కేంద్ర ప్రభుత్వం కాపీ కొడుతోందని శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి విమర్శించారు. చిట్యాల మండలం ఉరుమడ్లలో రూ.20 లక్షలతో అంగన్‌వాడీ భవనాలు, వెంబావిలో రూ.10 లక్షలతో సీసీ రోడ్లు, రూ.3 లక్షలతో బస్‌షెల్టర్, ఎలికట్టెలో రూ.16 లక్షలతో గ్రామ పంచాయతీ భవనం, గాదిరెడ్డిపల్లిలో రూ.10 లక్షలతో సీసీ రోడ్ల నిర్మాణ పనులకు సోమవారం ఆయన నకిరేకల్ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్యతో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా గుత్తా మాట్లాడుతూ ఇటీవల రాజస్థాన్‌లో జరిగిన ఆల్ ఇండియా స్పీకర్స్, శాసనమండలి చైర్మన్ల సమావేశంలో తెలంగాణ రాష్ట్రంలో అమలవుతున్న పథకాలు అభివృద్ధిని వివరిస్తే వివిధ రాష్ట్రాల ప్రతినిధులు ఆశ్చర్యానికి లోనయ్యారని చెప్పారు. పేదల సంక్షేమం కోసం పనిచేస్తున్న రాష్ట్ర ప్రభుత్వానికి, సీఎం కేసీఆర్‌కు ప్రజలంతా మద్దతుగా నిలవాలన్నారు. ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య మాట్లాడుతూ పార్టీలకు, రాజకీయాలకు అతీతంగా రాష్ట్ర ప్రభుత్వం పని చేస్తుందన్నారు. ప్రస్తుతం కొనసాగుతున్న సంక్షేమ పథకాలు అమలు కావాలంటే బీఆర్‌ఎస్ పార్టీకి ప్రజలు మద్దతుగా నిలవాలన్నారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రేగట్టె మల్లికార్జున్‌రెడ్డి, ఎంపీపీ కోలను సునీత, జెడ్పీటీసీ సుంకరి ధనమ్మ, మండల ఎంపీటీసీల ఫోరం అధ్యక్షుడు పెద్దబోయిన సత్తయ్య యాదవ్, ఉరుమడ్ల, ఎలికట్టె, వెంబాయి సర్పంచ్‌లు కంచర్ల శ్రీనువాస్‌రెడ్డి, ఉయ్యాల సత్తయ్యగౌడ్, అద్దెల నర్సిరెడ్డి, ఎంపీటీసీ గొలనుగొండ దశరథ, గుత్తా యాదగిరిరెడ్డి, అయిలయ్య, మల్లారెడ్డి, ఉప్పల్‌రెడ్డి, నర్సింహగౌడ్, వెంకటేశ్వర్లు, జానయ్య, ప్రసాద్, భాస్కర్‌రావు, వెంకటేష్‌గౌడ్, ప్రభాకర్ రావు తదితరులు పాల్గొన్నారు.

జేఎల్‌ఎం అభ్యర్థులకు పోల్ క్లైంబింగ్



పోల్ క్లైంబింగ్ చేస్తున్న అభ్యర్థి

నల్లగొండ : విద్యుత్ శాఖలో జూనియర్ లైన్‌మెన్ (జేఎల్‌ఎం) పోస్టులకు భర్తీ కోసం సోమవారం నల్లగొండలోని డీఈ కార్యాలయంలో పోల్ క్లైంబింగ్ నిర్వహించారు. మొదటిరోజు నల్లగొండ జిల్లాలోని 234 మంది అభ్యర్థులకు గాను 91 మందిని పోల్ క్లైంబింగ్‌కు పిలువగా 13 మంది గైర్హాజరయ్యారు. హాజరైన వారందరికీ మొదటి సర్టిఫికెట్లు వెరిఫికేషన్ తర్వాత పోల్ క్లైంబింగ్ నిర్వహించారు. విద్యుత్ శాఖ ఏర్పాటు చేసిన కమిటీ ఆధ్వర్యంలో పోల్ క్లైంబింగ్ సాగింది. ఈ పోల్ క్లైంబింగ్ పరీక్ష మొత్తం వీడియో రికార్డ్ చేశారు. వీడియోను పరిశీలించిన తర్వాత ఎంతమంది పోల్ క్లైంబింగ్‌లో ఉత్తీర్ణులయ్యారనేది పరిశీలించనున్నారు. మంగళవారం 90 మందికి, బుధవారం 83 మందికి పోల్ క్లైంబింగ్ నిర్వహించనున్నారు. నల్లగొండ జిల్లా అభ్యర్థులు పూర్తయాక.. సెప్టెంబర్ 1, 2 తేదీల్లో సూర్యాపేట జిల్లాకు చెందిన వారికి, 3, 4 తేదీల్లో యాదాద్రిభువనగిరి జిల్లాకు చెందిన అభ్యర్థులకు నల్లగొండలోనే పోల్ క్లైంబింగ్ నిర్వహించనున్నారు. కార్యక్రమంలో 1104 యూనియన్ నాయకులు ఎస్.వెంకటయ్య, జయపాల్‌రెడ్డి, వెంకటేశ్వర్లు, కరెంట్‌రావు, ఏవీ.రావు, ఎం.సురేష్‌కుమార్, రాజు, పి.వెంకటేశ్వర్లు తదతరులు పాల్గొన్నారు.



పోల్ క్లైంబింగ్‌ను పరిశీలిస్తున్న కమిటీ సభ్యులు

ఇళ్ల స్థలాల పట్టాల పంపిణీలో రసాభాస

- అనర్హులకు కేటాయించారని పలువురు ఆగామోత్కూర్ గ్రామస్తుల ఆరోపణ
- ఎమ్మెల్యే రాక ముందే పంపిణీని వాయిదా వేసిన అధికారులు



అధికారులతో వాగ్వాదానికి దిగిన ఆగామోత్కూర్ గ్రామస్తులు

మాడుగులపల్లి: మండలంలోని ఆగామోత్కూర్ గ్రామంలో సోమవారం నిర్వహించిన ఇళ్ల స్థలాల పట్టాల పంపిణీ కార్యక్రమంలో రసాభాస నెలకొంది. గ్రామంలోని అర్హులకు ఇళ్ల స్థలాలు పంపిణీ చేసేందుకు సర్వే నంబర్ 108, 111లో అధికారులు నాలుగు ఎకరాల ప్రభుత్వ భూమిలో ప్లాట్లు చేశారు. లబ్ధిదారులకు సోమవారం మిర్యాలగూడ ఎమ్మెల్యే భాస్కర్‌రావు చేతుల మీదుగా పట్టాలు పంపిణీ చేసేందుకు ఏర్పాట్లు చేశారు. అధికారులు అర్హుల వివరాలు వెల్లడిస్తుండగా.. అనర్హులకు కేటాయించారని కొందరు ఆరోపిస్తూ వాగ్వాదానికి దిగారు. పోలీసులు వారికి సర్దిచెప్పేందుకు యత్నించినా వినకపోవడంతో ఎమ్మెల్యే రాకముందే పట్టాల పంపిణీని వాయిదా వేస్తున్నట్లు రెవెన్యూ అధికారులు ప్రకటించారు. అర్హులంతా దరఖాస్తు చేసుకోవాలని రెండు రోజుల తర్వాత పట్టాలు పంపిణీ చేస్తామని తహసీల్దార్ జమీరొద్దీన్ తెలిపారు. అనర్హుల వివరాలు అందిస్తే జాబితా నుంచి తొలగిస్తామని పేర్కొన్నారు. కాగా ఇళ్ల స్థలాల కేటాయింపులో పారదర్శకత లోపించిందని, అధికారులు ఇష్టారాజ్యంగా లబ్ధిదారులను గుర్తించారని పలువురు గ్రామస్తులు ఆరోపించారు. 124 మందికి పంపిణీ చేసేందుకు అవకాశం ఉన్నా 74 మందికే ఎలా కేటాయిస్తారని నిలదీశారు. అర్హులందరికీ పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు.

ఐటీ హబ్‌లో ఉద్యోగాలకు 1న జాబ్‌మేళా



నల్లగొండ : నల్లగొండ జిల్లా కేంద్రంలో ప్రారంభం కానున్న ఐటీ హబ్‌లో ఉద్యోగాల కోసం సెప్టెంబర్ 1న 14 కంపెనీలతో టాస్క్ ఆధ్వర్యంలో మెగా జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి కల్పన అధికారి ఎస్.పద్మ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తిగల డిగ్రీ, పోస్టు గ్రాడ్యుయేట్, బీటెక్, డిప్లొమా అర్హతగల యువతి యువకులు task.telangana.gov.in/placements వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. నాలుగు సెట్ల బయోడెటా, పాస్‌పోర్టు సైజ్ ఫొటోలతో హాజరు కావాలని సూచించారు. ఇతర వివరాల కోసం 98499 09553, 99517 20856 ఫోన్ నంబర్లను సంప్రదించాలని పేర్కొన్నారు.

రెండవ ఏఎన్‌ఎంలను రెగ్యులరైజ్ చేయాలి

నల్లగొండ టూటౌన్ : 2వ ఏఎన్‌ఎంలను రెగ్యులరైజ్ చేసి వారు 13 రోజులుగా చేస్తున్న సమ్మెను విరమింపజేయాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి పల్లా దేవేందర్‌రెడ్డి కోరారు. సమ్మెలో భాగంగా సోమవారం డీఎంహెచ్‌ఓ కార్యాలయం నుంచి డీఈఓ ఆఫీస్ వరకు ర్యాలీ నిర్వహించి అంబేడ్కర్ విగ్రహం వద్ద రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 20 ఏళ్లుగా రెండవ ఏఎన్‌ఎంలు పనిచేస్తున్నారని తెలిపారు. సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని సుప్రీంకోర్టు చెప్పినా.. రెగ్యులర్ ఏఎన్‌ఎం, మొదటి ఏఎన్‌ఎం, రెండవ ఏఎన్‌ఎంలు ఒకే రకమైన పని చేసినప్పుడు వేతనాల్లో తేడాలు ఎందుకు ఇస్తున్నారని దేవేందర్‌రెడ్డి విమర్శించారు. యూనిఫాం అలవెన్స్ కూడా ఇవ్వడం లేదన్నారు.తెలంగాణ వస్తే కాంట్రాక్ట్ వ్యవస్థ ఉండదని చెప్పిన ప్రభుత్వం 16 సంవత్సరాలుగా పని చేస్తున్న వారిని పర్మినెంట్ చేయకపోవడం అన్యాయమని అన్నారు. ప్రస్తుతం పని చేస్తున్న రెండవ ఏఎన్‌ఎంలను అందరికీ బేషరతుగా రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్ చేశారు. కరోనా వంటి కష్టకాలంలో ఎన్నో ఆటుపోట్లను తట్టుకొని తమ ప్రాణాలను ఫణంగా పెట్టి ప్రజలకు సేవలందించారని చెప్పారు. సమస్యలు పరిష్కారించే వరకు సమ్మె విరమించేది లేదన్నారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా కోశాధికారి డి.వెంకన్న, డివిజన్ కార్యదర్శి లెనిన్, నర్సమ్మ, పద్మ, నాగమణి, వసంత, సులోచన, హరిత, గీతారాణి, మాధురి, నిర్మల, వెంకటమ్మ, వనజాత, సుప్రియ, వసుమతి, సైదమ్మ, ప్రేమలత, దనలక్ష్మి, సరిత, శోభ, రుక్సాన, సాలమ్మ తదితరులు పాల్గొన్నారు.



నల్లగొండలోని అంబేద్కర్ విగ్రహం వద్ద రాస్తారోకో చేస్తున్న రెండవ ఏఎన్ఎంలు

పరిశ్రమల దరఖాస్తులను ఆమోదించాలి

- కలెక్టర్ ఆర్‌వి.కర్ణన్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ కర్ణన్, పక్కన అదనపు కలెక్టర్లు

నల్లగొండ : టీఎస్– ఐపాస్ కింద పరిశ్రమల స్థాపనకు వచ్చిన దరఖాస్తులు అన్ని అర్హతలతో ఉంటే సాధ్యమైనంత త్వరగా ఆమోదించాలని కలెక్టర్ ఆర్‌వీ.కర్ణన్ ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన జిల్లా పరిశ్రమల ప్రోత్సాహక కమిటీ, టీఎస్ ఐపాస్ కమిటీ సమావేశంలో ఆయన టీఎస్– ఐపాస్ కింద వచ్చిన దరఖాస్తులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టీఎస్– ఐపాస్ కింద పరిశ్రమల స్థాపనకు సుమారు 20 శాఖలు అనుమతులు ఇవ్వాల్సి ఉంటుందన్నారు. సింగిల్ విండో పద్ధతిన అనుమతులు ఇస్తున్నందున అన్నీ సక్రమంగా ఉంటే అలాంటి వాటికి వెంటనే అనుమతించాలని చెప్పారు. ఆయా శాఖల లాగిన్లలో దరఖాస్తులు పెండింగ్ లేకుండా చూసుకోవాలని తెలిపారు. టీ–ప్రయిడ్ కింద వచ్చిన 153 దరఖాస్తుల విషయంలో రాష్ట్ర ప్రభుత్వ ఆదేశం మేరకు ఔత్సాహిక ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగ పారిశ్రామిక వేత్తలకు ఇచ్చే సబ్సిడీ శాతం విషయమై బ్యాంకర్లతో పూర్తిస్థాయిలో సమీక్షించిన తర్వాత ఆమోదిస్తామని తెలిపారు. సమావేశంలో అదనపు కలెక్టర్‌లు హేమంత్ కేశవ్ పాటిల్, జె.శ్రీనివాస్, జిల్లా పరిశ్రమల మేనేజర్ కోటేశ్వరరావు, ఏడీ గణేష్, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ ఎల్ శ్రీనివాస్‌నాయక్ పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలు అర్హులకు అందించాలి
నల్లగొండ : సంక్షేమ పథకాలు అర్హులకు సకాలంలో అందించి లబ్ధి చేకూరేలా ప్రత్యేక చొరవ చూపాలని కలెక్టర్ కర్ణన్ పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి సోమవారం సాయంత్రం హైదరాబాద్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఆసరా పింఛన్లు, తెలంగాణకు హరితహారం, బీసీలు, మైనార్టీలకు ఆర్థిక సాయం, నోటరీ భూముల క్రమబద్ధీకరణ, గొర్రెల పంపిణీ, గృహలక్ష్మి, కారుణ్య నియామకాలు తదితర అంశాలపై కలెక్టర్లతో సమీక్షించారు. సమావేశం అనంతరం అధికారులతో నిర్వహించిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాకు రెండవ విడత గొర్రెల పంపిణీకి గొర్రెల ప్రొక్యూర్‌మెంట్‌కు కొత్తగా నాలుగు టీమ్‌లు ఏర్పాటు చేసి పంపిణీ ప్రక్రియ వేగవంతం చేస్తున్నట్లు తెలిపారు. తెలంగాణకు హరితహారంలో జిల్లాకు నిర్దేశించిన లక్ష్యాలు, సంపద వనాలు లక్ష్యం 15 రోజుల్లో పూర్తి చేయాలని, సంపద వనాలు 90 శాతం పూర్తి అయినట్లు, చిన్న మొక్కలకు బదులు పెద్ద మొక్కలు నాటాలని సూచించారు. బీసీలకు రూ.లక్ష ఆర్థికసాయం పెండింగ్ త్వరగా పూర్తి చేయాలని, గృహలక్ష్మి వెరిఫికేషన్ పూర్తి అయినందున దరఖాస్తుల వివరాలు గృహలక్ష్మి అప్‌లోడ్ చేయాలని, మంజూరు చేసి గ్రౌండింగ్‌కు చర్యలు తీసుకోవాలని అన్నారు. దళిత బంధు వెరిఫికేషన్ చేసి మంజూరు చేయాలని అన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్‌లు హేమంత్ కేశవ్ పాటిల్, జె.శ్రీనివాస్, డీఎఫ్‌ఓ రాజశేఖర్ పాల్గొన్నారు.

ప్రజావాణి దరఖాస్తులను పరిష్కరించాలి



ఫిర్యాదులు స్వీకరిస్తున్న కలెక్టర్ కర్ణన్

నల్లగొండ : ప్రజావాణి కార్యక్రమంలో స్వీకరించిన ఫిర్యాదులను సత్వరం పరిష్కరించాలని కలెక్టర్ ఆర్‌వీ.కర్ణన్ అధికారులను ఆదేశించారు. ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో అదనపు కలెక్టర్‌లు హేమంత్ కేశవ్ పాటిల్, జె.శ్రీనివాస్‌తో కలిసి ఆయన ప్రజల వద్ద నుంచి ఫిర్యాదులను స్వీకరించారు. ప్రజల నుంచి అందిన ఫిర్యాదులను జిల్లా కలెక్టర్ ఎండార్స్ చేస్తూ సంబంధిత శాఖల అధికారులు చర్యలు తీసుకునేందుకు ఆదేశించారు. ఫిర్యాదులు పెండింగ్‌లో ఉండకుండా ఎప్పటికప్పుడు పరిష్కరించాలని అధికారులకు ఆయన ఆదేశాలు జారీ చేశారు. కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

హైనా పాదముద్రలుగా నిర్ధారణ


అడుగులను పరిశీలిస్తున్న అటవీ అధికారి

రామగిరి(నల్లగొండ): తిప్పర్తి గ్రామ పంచాతీయ పరిధిలోని నూకలవారిగూడేనికి చెందిన గుండెబోయిన సైదులు వ్యవసాయ భూమిలో అనుమానిత జంతువు అడుగులను సోమవారం బీట్ అధికారి యాదగిరిరెడ్డి పరిశీలించారు. అవి చిరుత అడుగులు కావని.. హైనా పాదముద్రలని నిర్ధారించారు.

రాంబాయమ్మ కుటుంబానికి ఆర్థికసాయం

మునగాల: మండల కేంద్రానికి చెందిన వెగ్గళం రాంబాయమ్మ కుటుంబానికి సోమవారం బీఎస్పీ కోదాడ నియోజకవర్గ ఇన్‌చార్జి పిల్లుట్ల శ్రీనివాస్ రూ.ఐదువేల ఆర్థికసాయం అందించారు. 27వ తేదీన సాక్షి దినపత్రికలో 30ఏళ్లగా గుడిసెలో నివాసం అనే శీర్షికన వచ్చిన కథనానికి అయన స్పందించారు. దీంతో సోమవారం మునగాలలోని దివ్యాంగురాలైన రాంబాయమ్మ నివాసానికి చేరుకొని సాయం అందించారు. కార్యక్రమంలో బీసీ విద్యార్థి సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి పచ్చిపాల రామకృష్ణ యాదవ్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు పోలంపల్లి సుధాకర్ గౌడ్, మండల బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు చింతకాయల నాగరాజు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్రగాయాలు

మునగాల(కోదాడ): జాతీయ రహదారిపై మునగాల మండలం ముకుందాపురం శివారులో సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్రగాయాలయ్యాయి. కోదాడ నుంచి సూర్యాపేట వైపు ద్విచక్ర వాహనంపై హుజూర్‌నగర్ పట్టణానికి చెందిన ఇద్దరు వ్యక్తులు వెళ్తుండగా అదే దారిలో వెనుక నుంచి అతివేగంగా ప్రయాణిస్తున్న కారు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలు కాగా చికిత్స నిమిత్తం కోదాడకు తరలించారు. ప్రమాదానికి కారణమైన కారును పోలీసుస్టేషన్‌కు తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్‌ఐ మల్సూరు తెలిపారు.

చోరీ కేసులో నిందితుడి అరెస్ట్

వేములపల్లి : చోరీ కేసులో నిందితుడిని పోలీసులు అరెస్ట్ చేశారు. ఎస్‌ఐ డి.విజయ్‌కుమార్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. వేములపల్లి మండలం ఆమనగల్లు గ్రామంలోని గొట్టిపర్తి ఎల్లమ్మ ఇంట్లో ఈ నెల 24న అదే గ్రామానికి చెందిన గొట్టిపర్తి నర్సయ్య చోరీకి పాల్పడి బంగారపు లక్ష్మీదేవి బిల్ల, జత కాళ్ల పట్టీలు, నాలుగు జతల మెట్టలతోపాటు కొంత డబ్బు అపహరించుకుపోయాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు నిందితుడిని సోమవారం గ్రామ శివారులో అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరిచినట్లు ఎస్‌ఐ తెలిపారు.

వినియోగదారుల సంఘాల సమాఖ్య సెక్రటరీగా సోమయ్య

మోత్కూరు : తెలంగాణ వినియోగదారుల సంఘాల సమాఖ్య (క్యాట్కో) రాష్ట్ర జాయింట్ సెక్రటరీగా పోచం సోమయ్యను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆదివారం హైదరాబాద్‌లోని రాఘవ రత్న టవర్ ఆడిటోరియంలో తెలంగాణలోని 33 జిల్లాల వినియోగదారుల సంఘాల అధ్యక్షులు హాజరై ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా సోమయ్య సోమవారం విలేకరులతో మాట్లాడుతూ మండల స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు వినియోగదారుల సంఘాలను బలోపేతం చేసేందుకు కృషి చేస్తానని తెలిపారు. ఏకగ్రీవంగా ఎన్నుకున్న వారికి ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరి దుర్మరణం

మిర్యాలగూడ టౌన్ : వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరు దుర్మరణం చెందారు. మిర్యాలగూడ, భువనగిరి మండలాల పరిధిలో చోటు చేసుకున్న ఈ ఘటనల వివరాలు ఇలా ఉన్నాయి. మిర్యాలగూడ మండలం తుంగపాడు గ్రామానికి చెందిన బూదురు గోపి(46) మిర్యాలగూడ పట్టణంలోని ఫ్లై ఓవర్ బ్రిడ్జి వద్ద గల ఓ వైన్స్ షాపు సిట్టింగ్‌లో వర్కర్‌గా పని చేస్తున్నాడు. రోజు మాదిరిగానే పనులు ముగించుకొని నడుచుకుంటూ తుంగపాడుకు వెళ్తున్నాడు. ఈ క్రమంలో జడ్చర్ల–కోదాడ ప్రధాన రహదారిపై మోడల్ స్కూల్ వద్ద ఆదివారం రాత్రి 11:30గంటల సమయంలో గుర్తు తెలియని వాహనం ఢీకొట్టింది. దీంతో బూదురు గోపికి తలకు బలమైన గాయాలయ్యాయి. స్థానికులు అతడిని మిర్యాలగూడ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. మృతుడికి భార్య, ఒక కుమార్తె ఉంది. మృతుడి భార్య జ్యోతి ఫిర్యాదు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు మిర్యాలగూడ రూరల్ ఏఎస్‌ఐ ఉమాపతి రావు తెలిపారు.


గోపి మృతదేహం

బైకు ఢీకొని..

భువనగిరి : బైకు ఢీకొని మహిళ మృతిచెందింది. భువనగిరి మండల పరిధిలోని అనంతారం గ్రామ పరిధిలో చోటు చేసుకున్న ఈ ఘటన వివరాలు ఇలా ఉన్నాయి. రంగారెడ్డి జిల్లా తిరుమలగిరి మండలం బోయినిపల్లి గ్రామానికి చెందిన బారనపల్లి రమేష్ , 20మంది బంధువులతో కలిసి ఈ నెల 25న యాదగిరిగుట్టకు డీసీఎం వాహనంలో వచ్చారు. రెండు రోజుల పాటు అక్కడే నిద్ర చేసి తిరిగి ఈ నెల 27న రాత్రి 10 గంటలకు స్వగ్రామానికి బయలుదేరారు. ఈ క్రమయంలో భువనగిరి పట్టణ శివారులోని అనంతారం గ్రామపరిధిలో గల శ్రీ రేణుక ఎల్లమ్మ దేవాలయం వద్ద వాహనాన్ని నిలిపి అమ్మవారి దర్శనం కోసం వెళ్లారు. దర్శనం అనంతరం బంధువులు వాహనం వద్దకు వెళ్లే క్రమంలో వరంగల్–హైదరాబాద్ రోడ్డు దాటుతుండగా బారనపల్లి సరిత(40)ను బైక్ ఢీకొట్టింది. ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన ఆమెను అదే రోజు రాత్రి బోడుప్పల్‌లోని ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. డాక్టర్ పరిశీలించి అప్పటికే ఆమె మృతి చెందినట్లు చెప్పారు. మృతురాలి బంధువు సోమవారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు రూరల్ ఎస్‌ఐ శివనాగప్రసాద్ తెలిపారు.

కుటుంబ కలహాలతో మహిళ ఆత్మహత్య

చండూరు(గట్టుప్పల్) : కుటుంబ కలహాలతో ఓ మహిళ ఆత్మహత్యకు పాల్పడింది. ఈ ఘటన గట్టుప్పల్ మండల పరిధిలో చోటు చేసుకుంది. మాడ్గులపల్లి మండలం ఆర్కెపల్లి గ్రామానికి చెందిన బన్నె రాములమ్మ, చంద్రయ్య దంపతుల కూతురు బౌరమ్మ (31)కు గట్టుప్పల్ మండలం తేరట్‌పల్లి గ్రామానికి అచ్చిన మల్లయ్యతో 18 సంవత్సరాల క్రితం వివాహం జరిగింది. వ్యవసాయంతో పాటు చేనేత పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. సాగు పెట్టుబడులతో పాటు కుటుంబ అవసరాల నిమిత్తం అప్పులు చేశారు. అవి తీర్చే మార్గం కనిపించగా కొంతకాలంగా కుటుంబంలో గొడవలు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలోనే మనస్తాపానికి గురైన బౌరమ్మ ఆదివారం రాత్రి ఇంట్లోనే పురుగుల మందు తాగింది. కొద్ది సేపటి తర్వాత కుటుంబ సభ్యులు గమనించి ఆమెను మునుగోడు ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. మృతురాలికి ఇద్దరు కుమారులు ఉన్నారు. మృతురాలి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ సురేష్ తెలిపారు.


బౌరమ్మ (ఫైల్)


ప్రశాంత్ (ఫైల్)

ఉరేసుకుని వ్యక్తి బలవన్మరణం

చింతపల్లి : ఉరేసుకుని ఓ వ్యక్తి బలవన్మరణానికి పాల్పడ్డాడు. ఈ ఘటన చింతపల్లి మండల పరిధిలోని కుర్మంపల్లిలో సోమవారం చోటు చేసుకుంది. ఎస్‌ఐ సతీష్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం .. చింతపల్లి మండల పరిధిలోని కుర్మంపల్లి గ్రామంలో ఆర్‌వివి కోళ్ల ఫారంలో ఒడిశా రాష్ట్రానికి చెందిన జ్వాలేశ్వర్ ముఖి (31), తన భార్య నందినితో కలసి రెండు నెలలుగా పని చేస్తున్నారు. ఆదివారం రాత్రి కూడా పనులు ముగిశాక రాత్రి 10 గంటల సమయంలో ఇరువురు తగాదా పడ్డారు. ఉదయం 3 గంటల సమయంలో భార్య నందిని నిద్ర లేచి చూసేసరికి జ్వాలేశ్వర్ ముఖి తాడుతో ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని దేవరకొండ ప్రభుతాస్పత్రికి తరలించారు. మృతుడి భార్య నందిని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

దత్తప్పగూడెంలో యువకుడు..

మోత్కూరు : మద్యానికి బానిసైన ఓ యువకుడు ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటన మోత్కూరు మండలం దత్తప్పగూడెం గ్రామంలో సోమవారం వెలుగులోకి వచ్చింది. దత్తప్పగూడెం గ్రామానికి చెందిన కొత్తపల్లి నర్సయ్య, సావిత్రి దంపతులకు కుమారుడు, ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. కుమారుడు కొత్తపల్లి ప్రశాంత్ (27) కొంత కాలంగా మద్యానికి బానిసయ్యాడు. హైదరాబాద్‌లో హెయిర్ సెలూన్‌లో పని చేస్తున్న ప్రశాంత్ ఇటీవల స్వగ్రామానికి వచ్చాడు. సోమవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మోత్కూరు పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని రామన్నపేట ఏరియా ఆసుపత్రికి తరలించారు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

రైలు కిందపడి..

ఆలేరురూరల్ : రైలు కిందపడి ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన ఆలేరులో చోటు చేసుకుంది. పట్టణానికి చెందిన మంగలపల్లి సుధాకర్(36) డ్రైవర్‌గా జీవనం కొనసాగిస్తూ తల్లితో కలసి మార్కండేయ కాలనీలో ఉంటున్నాడు. పెళ్లి కావడం లేదని, సరైన పని లభించకపోవడంతో మనస్తాపం చెందాడు. ఈ నేపథ్యంలోనే సోమవారం 263/9–11 ఆఫ్‌లైన పట్టాలపై ఆత్మహత్య చేకున్నాడని తెలిపారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ఆలేరు ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు భువనగిరి రైల్వే హెడ్ కానిస్టేబుల్ సత్యనారాయణ తెలిపారు.

పురుగుల మందు తాగి..

గుర్రంపోడు : పురుగుల మందు తాగి ఓ విద్యార్థిని ఆత్మహత్యకు పాల్పడింది. ఈ ఘటన గుర్రంపోడు మండలంలోని తానేదార్‌పల్లి గ్రామంలో జరిగింది. గ్రామానికి చెందిన శివార్ల ఇందూ (11) మండల కేంద్రంలోని మోడల్ స్కూల్‌లో 8వ తరగతి చదువుతోంది. ఇంట్లో పురుగులమందు తాగగా హుటాహుటిన నల్లగొండ ఆసుపత్రికి తరలించారు. మార్గమధ్యంలోనే మృతిచెందింది. తండ్రి మందలించగా క్షణికావేశంలో ఆత్మహత్యకు పాల్పడి ఉండవచ్చని గ్రామస్తులు చెబుతుండగా అందుకు గల కారణాలు తెలియరావడం లేదు.

చోరీలకు పాల్పడుతున్న వ్యక్తి అరెస్ట్

- రూ.10.09 లక్షల విలువైన బంగారం, వెండి ఆభరణాలు స్వాధీనం
- నిందితుడు సూర్యాపేట జిల్లా వాసి

వరంగల్ క్రైం : వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో తాళం వేసిన ఇళ్లలో చోరీలకు పాల్పడుతున్న దొంగను సీసీఎస్, హనుమకొండ పోలీసులు అరెస్ట్ చేశారు. నిందితుడి నుంచి రూ.10.09 లక్షల విలువైన 163 గ్రాముల బంగారం, 180 గ్రాముల వెండి ఆభరణాలను స్వాధీనం చేసుకున్నారు. క్రైం ఏసీపీ మల్లయ్య కథనం ప్రకారం.. సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్ మండలం కరక్కాయలగూడెం గ్రామానికి చెందిన సన్నిధి అంజనేయులు చిన్నప్పటి నుంచే చోరీలకు పాల్పడుతూ పోలీసులకు చిక్కి పలుమార్లు జువైనల్ హోంకు వెళ్లాడు. కొద్ది రోజుల అనంతరం మరోమారు మిర్యాలగూడ, ఖమ్మం, హుజూర్‌నగర్, గద్వాల్ పోలీస్ స్టేషన్ ప్రాంతాల్లో చోరీలకు పాల్పడడంతో పోలీసులు అరెస్ట్ జైలుకు తరలించారు. జైలు నుంచి విడుదలైన అనంతరం మరోసారి వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో తాళం వేసి ఉన్న ఇళ్లల్లో చోరీలకు పాల్పడ్డాడు. దీనిపై అప్రమత్తమైన పోలీసులు దర్యాప్తు చేపట్టి నిందితుడిని గుర్తించారు. చోరీ సొత్తును విక్రయించేందుకు సోమవారం హనుమకొండ పబ్లిక్ గార్డెన్ పరిసరాల్లో తిరుగుతున్నట్లు సమాచారం అందడంతో నిందితుడిని పట్టుకున్నారు. అనంతరం విచారించగా నిందితుడు తన నేరం అంగీకరించాడని పోలీసులు తెలిపారు.



నిందితుడి నుంచి స్వాధీనం చేసుకున్న ఆభరణాలు

గుర్తుతెలియని వ్యక్తి మృతి

యాదగిరిగుట్ట రూరల్: మండలంలోని వంగపల్లి గ్రామంలోని రైల్వే స్టేషన్ ప్లాట్ ఫాం, నంబర్–2 పై గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైంది. సుమారు 40 నుంచి 50 సంవత్సరాలు వయస్సు కలిగి ఉన్న వ్యక్తి, తెలుపు రంగు ఆఫ్ షర్ట్, బూడిద రంగు ప్యాంటు వేసుకుని ఉన్నాడు. చేతికి కడెం, ఉంగరం ఉంది. స్థానికులు గమనించి రైల్వే పోలీసులకు సమాచారం అందజేశారు. మృతుడి వద్ద ఎటువంటి ఆధారాలు దొరకలేదు. అనారోగ్య కారణాలతో మృతిచెంది ఉంటాడని భావిస్తున్నారు. మృతదేహాన్ని భువనగిరి ఏరియా ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు కేసును నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్ కానిస్టేబుల్ సత్యనారాయణ తెలియజేశారు.


గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం

సమగ్ర యాజమాన్య పద్ధతులు పాటించాలి

గరిడేపల్లి : మిరప సాగులో సమగ్ర యాజమాన్య పద్ధతులు పాటిస్తే అధిక దిగుబడులు పొందవచ్చని నారమ్ ప్రిన్సిపాల్, షెడ్యూల్ కులాల ఉప ప్రణాళిక చైర్మన్ సైంటిస్ట్ డాక్టర్ ఎం. బాలకృష్ణన్ అన్నారు. సోమవారం గరిడేపల్లి మండలం గడ్డిపల్లి కేవీకేలో నేషనల్ అకాడమీ ఆఫ్ అగ్రికల్చరల్ రీసర్చ్ మేనేజిమెంటు(నారమ్)–హైదరాబాద్ వారి ఆర్థిక సహాయంతో షెడ్యూల్ కులాల ఉప ప్రణాళికలో భాగంగా రైతులకు మిరప పంట–సమగ్ర యాజమాన్య పద్ధతులు అనే అంశంపై ఏర్పాటు చేసిన మూడు రోజుల శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. సీనియర్ శాస్త్రవేత్త లవకుమార్ మాట్లాడుతూ రైతులు వరి పంటనే కాకుండా కొద్ది మొత్తంలో వాణిజ్య పంటలు పండిస్తే ఎంతో లాభదాయకంగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో కేవీకే శాస్త్రవేత్తలు డి. ఆదర్శ్, నరేష్, కిరణ్, మాధురీ, సుగంధిలతో పాటు 25 మంది రైతులు తదితరులున్నారు.



మాట్లాడుతున్న శాస్త్రవేత్త బాలకృష్ణన్

గీత కార్మికుడి మృతి

మిర్యాలగూడ : తాటి చెట్టు పైనుంచి పడి ఓ గీత కార్మికుడు మృతిచెందాడు. ఈ ఘటన దామరచర్ల మండలంలోని గాంధీనగర్‌లో సోమవారం చోటు చేసుకుంది. స్థానికులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. దామరచర్ల మండలంలోని గాంధీ నగర్‌కు చెందిన పోతులూరి శ్రీనివాస్‌గౌడ్(38) ఉదయం తాటిచెట్టు ఎక్కుతుండగా జారి కిందపడిపోయాడు. తీవ్రంగా గాయపడిన అతడిని కుటుంబ సభ్యులు మిర్యాలగూడ ఏరియా ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతుడికి కుమారుడు, కూతురు ఉన్నారు. శ్రీనివాస్‌గౌడ్ మరణంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.


శ్రీనివాస్‌గౌడ్ (ఫైల్)

మట్టపల్లిలో నిత్య కల్యాణం

మఠంపల్లి: మట్టపల్లి శ్రీలక్ష్మీనృసింహస్వామి దేవాలయంలో శ్రీరాజ్యలక్ష్మీ, చెంచులక్ష్మీ సమేత శ్రీలక్ష్మీనృసింహస్వామి నిత్య కల్యాణాన్ని సోమవారం అర్చకులు వైభవంగా నిర్వహించారు. ఆలయంలో సుప్రభాతసేవ, నిత్యహోమం, మూలవిరాట్ స్వామికి పంచామృతాభిషేకం నిర్వహించారు. శ్రీలక్ష్మీ నరసింహస్వామి, రాజ్యలక్ష్మీ, చెంచులక్ష్మీ అమ్మవార్లకు అష్టోత్తర, సహస్ర,కుంకుమార్చనలు గావించారు. కల్యాణతంతులో భాగంగా నూతన పట్టు వస్త్రాలంకరణతో స్వామిఅమ్మవార్లను వధూవరులుగా అలంకరించి ఎదుర్కోళ్ల మహోత్సవ సంవాదం చేపట్టారు. అనంతరం విశ్వక్సేనపూజ, పుణ్యాహవచనం, రక్షాబంధనం, పంచగవ్యప్రాశన, రుత్విగ్వరణం, మధుపర్క పూజ ,మాంగల్యధారణ, తలంబ్రాలతో వైభవంగా నిర్వహించారు. క్షేత్రంలోని శివాలయంలో శ్రీపార్వతీరామలింగేశ్వరస్వామికి మహన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకం నిర్వహించారు.అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆలయ అనువంశిక ధర్మకర్తలు చెన్నూరు విజయ్‌కుమార్, మట్టపల్లిరావు, ఈఓ నవీన్, అర్చకులు కృష్ణమాచార్యులు, పద్మనాభాచార్యులు, బదరీనారాయణాచార్యులు, లక్ష్మీనరసింహమూర్తి, ఆంజనేయాచార్యులు పాల్గొన్నారు.

సిమెంట్ ట్యాంకర్ బోల్తా

నాగారం : సూర్యాపేట–జనగాం జాతీయ రహదారిపై ప్రగతినగర్ వద్ద ఆదివారం రాత్రి సిమెంట్ లోడ్‌తో వెళుతున్న ట్యాంకర్ బోల్తా పడింది. కోదాడ నుంచి కరీంనగర్‌కు సిమెంట్ లోడ్‌తో వెళుతున్న ట్యాంకర్ డ్రైవర్ నిద్రమత్తులో వాహనం నడుపుతుండటంతో నాగారం మండలం ప్రగతినగర్ వద్ద అదుపుతప్పి రోడ్డుపక్కన ఉన్న కల్వర్టును ఢీకొని బోల్తా పడింది. ఈ ఘటనలో డ్రైవర్ స్వల్ప గాయాలతో బయటపడ్డాడు.


ప్రగతినగర్ వద్ద బోల్తా పడిన సిమెంట్ ట్యాంకర్

ఐకమత్యంతోనే రాజ్యాధికారం సాధ్యం

- బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సత్యనారాయణ

హుజూర్‌నగర్ : ఐకమత్యంతోనే రాజ్యాధికారం సాధ్యమని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు యర్ర సత్యనారాయణ అన్నారు. చట్టసభల్లో బీసీలు అధిక సంఖ్యలో ప్రవేశించిన నాడే అన్ని కులాల వారికి సమన్యాయం జరుగుతుందన్నారు. సోమవారం హుజూర్‌నగర్‌లో ఆ సంఘం నియోజకవర్గం ముఖ్య నాయకుల సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడారు. జనాభా దామాషా ప్రకారం అసెంబ్లీలో 48 మంది బీసీలు ఎమ్మెల్యేలుగా, సుమారు 8 మంది బీసీలు మంత్రులుగా ఉండాలన్నారు. సెప్టెంబర్ రెండవ వారంలోగా సూర్యాపేటలో జరిగే బీసీల పొలికేక బహిరంగ సభకు వేలాదిగా తరలిరావాలని పిలుపునిచ్చారు. అనంతరం ఆయనను శాలువతో సన్మానించారు. కార్యక్రమంలో ఆ సంఘం జిల్లా కన్వీనర్ ధనుంజయ నాయుడు, ధూళిపాళ శ్రీనివాస్, గోవిందరావు, నరసింహచారి, ఆర్ వెంకటేశ్వర్లు, శ్రీను, సతీష్, దీప, నాగయ్య, చంద్రయ్య, వెంకన్న, నాగేశ్వరరావు పాల్గొన్నారు.


సత్యనారాయణను సన్మానిస్తున్న నాయకులు

గురుకుల విద్యార్థిని అదృశ్యంపై ఫిర్యాదు

- తల్లితో కలసి హాస్టల్‌కు తిరిగి వచ్చిన విద్యార్థిని
- టీసీ ఇచ్చి పంపించిన ప్రిన్సిపాల్

బీబీనగర్: మండల కేంద్రంలోని గురుకుల బీసీ సంక్షేమ వసతి గృహ పాఠశాలలో చదువుతున్న ఓ విద్యార్థిని అదృశ్యమైందని ప్రిన్సిపాల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. సదరు విద్యార్థిని సోమవారం తల్లితో హాస్టల్‌కు రావడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. రామన్నపేటకు చెందిన లక్ష్మీ ప్రసన్న గురుకుల బీసీ పాఠశాలలో 8వ తరగతి చదువుతుంది. ఆదివారం మధ్యాహ్నం విరామం సమయంలో సమాచారం ఇవ్వకుండా బయటికి వెళ్లింది. రాత్రి వరకు హాస్టల్‌కు చేరుకోలేదు. దీంతో ప్రిన్సిపాల్ అలీమొద్దీన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. అదే రోజు రాత్రి లక్ష్మి ప్రసన్నను తిరిగి తన తల్లి హాస్టల్‌కు తీసుకువచ్చింది. దీంతో విద్యార్థిని హాస్టల్‌కు చేరుకున్నట్లు పోలీస్‌లకు సమాచారం ఇవ్వడంతో ఊపిరి పీల్చుకున్నారు. సమాచారం ఇవ్వకుండా బయటకు వెళ్లిన విద్యార్థినిపై క్రమ శిక్షణా చర్యలో భాగంగా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు టీసీ ఇచ్చి పంపించినట్లు ప్రిన్సిపాల్ అలీమొద్దీన్ తెలిపారు.

108 వాహనంలో ప్రసవం.. తల్లీబిడ్డ క్షేమం

మాడుగులపల్లి : పురిటి నొప్పులతో బాధపడుతున్న గర్భిణిని ఆసుపత్రికి తరలిస్తుండగా 108 వాహనంలో ప్రసవించింది. మాడుగులపల్లి మండలం చెర్లగూడేనికి చెందిన పి.నాగలక్ష్మి నిండు గర్భిణి. పురిటినొప్పులు రావడంతో మిర్యాలగూడ ఏరియా ఆసుపత్రికి తీసుకెళ్లేందుకు కుటుంబ సభ్యులు 108 వాహనానికి సమాచారం అందించారు. వాహనంలో వెళ్తుండగా నొప్పులు అధికమవడంతో ఈఎంటీ వెలిజాల సైదులు, పైలెట్ పరమేష్ చొరవ తీసుకొని పురుడు పోశారు. దాంతో నాగలక్ష్మి రెండో కాన్పులో ఆడ శిశువుకు జన్మనిచ్చింది.


108 వాహనంలో తల్లీబిడ్డ, సిబ్బంది

కార్యకర్తల అభిప్రాయం మేరకే పొత్తులు

- టీపీసీసీ ప్రధాన కార్యదర్శి పున్న కైలాస్ నేత

మునుగోడు: కార్యకర్తల అభిప్రాయాల మేరకే నియోజకవర్గాల్లో వామపక్ష పార్టీలతో పొత్తులు ఉంటాయని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి పున్న కైలాస్ నేత తెలిపారు. మునుగోడులో ఏర్పాటు చేసిన కాంగ్రెస్ పార్టీ కార్యాలయాన్ని సోమవారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. మునుగోడు ఉప ఎన్నికల్లో కమ్యూనిస్టులని వాడుకుని మోసం చేసిన సీఎం కేసీఆర్‌కు ప్రజలు తగిన గుణపాఠం చెబుతారన్నారు. సీపీఐ, సీపీఎం పార్టీలతో పొత్తు ఉంటుందని కార్యకర్తలు ఆందోళన చెందవద్దని, పొత్తుల విషయంలో రాష్ట్ర కమిటీ ఇంకా ఎలాంటి నిర్ణయం తీసుకోలేదన్నారు. త్వరలో జరుగనున్న ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ 80 స్థానాల్లో గెలుపొందుతుందన్నారు. టీపీసీసీ అధికార ప్రతినిధి పాల్వాయి స్రవంతి రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో బీఆర్ఎస్ ప్రభుత్వం, కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజలకు వివరించాలన్నారు. సమావేశంలో ఆ పార్టీ టీపీసీసీ కార్యదర్శి రజాక్, లింగయ్య, రవి, సాగర్ రెడ్డి, బడే సాబ్, నర్సింహాచారి, మేకల శ్రీనివాస్‌రెడ్డి, హనుమంత్ గౌడ్, సంజీవ, రఫీ, కాటం వెంకన్న, మధు ప్రసాద్, పర్వతాలు, ఆరేళ్ల సైదులు, మేకల మల్లయ్య, బోయపర్తి లింగయ్య, శంకర్, నాగార్జునగౌడ్ తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న పున్న కైలాస్ నేత

బందోబస్తు ఏర్పాట్ల పరిశీలన

మేళ్లచెరువు : మైహోం సిమెంట్ పరిశ్రమ క్వారీ విస్తరణకు ఈ నెల 31న ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహించనున్నారు. అందుకు పోలీసు బందోబస్తు ఏర్పాట్లను సోమవారం సూర్యాపేట ఎస్పీ రాజేంద్ర ప్రసాద్ పరిశీలించారు. ఆయన వెంట స్పెషల్ బ్రాంచి ఇన్‌స్పెక్టర్ రాజేష్,సీఐలు రామలింగారెడ్డి,రామకృష్ణారెడ్డి, ఎస్‌ఐ.సురేష్, బాలకృష్ణ, పరిశ్రమ లైజన్ జనరల్ మేనేజర్ రాంమోహన్‌రావు ఉన్నారు.


ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎస్పీ

'వేముల'ను అభినందించిన జూలూరి

కోదాడ: కేఆర్‌ఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల తెలుగు అధ్యాపకుడు వేముల వెంకటేశ్వర్లుకు ఇటీవల తెలుగు యూనివర్సిటీ కీర్తిపురస్కార అవార్డు ప్రకటించడం అభినందనీయమని తెలంగాణ సాహిత్య అకాడమీ చైర్మన్ జూలూరి గౌరీశంకర్ అన్నారు. సోమవారం కోదాడలో ఆయనను జూలూరి ప్రత్యేకంగా అభినందించారు. కోదాడ ప్రాంత వాసి అవార్డుకు ఎంపిక కావడం ఆనందంగా ఉందన్నారు.


వేముల వెంకటేశ్వర్లును అభినందిస్తున్న గౌరీశంకర్

ఆస్పత్రి నుంచి వ్యక్తి అదృశ్యం

తుంగతుర్తి: ఆస్పత్రి నుంచి ఓ వ్యక్తి అదృశ్యమయ్యాడు. తుంగతుర్తి మండలం అన్నారం గ్రామానికి చెందిన బోర లింగయ్య అనారోగ్యానికి గురికావడంతో కుటుంబ సభ్యులు మూడు రోజుల క్రితం సూర్యాపేట ఏరియా ఆస్పత్రిలో చేర్పించారు. ఆదివారం సాయంత్రం ఎవరికి సమాచారం ఇవ్వకుండా లింగయ్య ఆస్పత్రి నుంచి వెళ్లిపోయారు. దీంతో అతడి ఆచూకీ కోసం కుటుంబ సభ్యులు గాలిస్తున్నారు.

పీఈటీని హత్య చేయించింది.. ఉపాధ్యాయుడే

- రూ.5లక్షల చొప్పున సుపారీ ఇచ్చేలా ముగ్గురితో ఒప్పందం
- నిందితులను అరెస్ట్ చేసిన పోలీసులు

కూసుమంచి: విద్యార్థులను తీర్చిదిద్దాల్సిన ఉపాధ్యాయుడు ఆ బాధ్యత మరిచి... వ్యక్తిగత కక్షతో మరో ఉపాధ్యాయుడిని హత్య చేయించాడు. అంతకుముందు కూడా ఆయనపై హత్య, వేధింపుల కేసులు ఉండగా కోర్టులో పరిచయమైన వ్యక్తికి సుపారీ ఇచ్చి ఈ హత్యకు వినియోగించాడు. ఈ ఘటన 23వ తేదీన జరగగా నిందితుల వివరాలను ఖమ్మం రూరల్ ఏసీపీ బస్వారెడ్డి సోమవారం వెల్లడించారు. సూర్యాపేట జిల్లా మోతె గ్రామానికి చెందిన పగడాల గిరిధర్‌రెడ్డి, బైరోజు వెంకటాచారి ఇళ్లు ఎదురెదురుగా ఉండేవి. ఇందులో గిరిధర్ తిరుమలగిరి మండలం మొండిచింత బావిలోని ప్రభుత్వ పాఠశాలలో ఎస్జీటీగా, చారి నడిగూడెం మండలం సిరిపురం ప్రభుత్వ పాఠశాలలో పీఈటీగా విధులు నిర్వర్తిస్తున్నారు. గిరిధర్, ఆయన భార్యకు తరచుగా గొడవలు జరుగుతుండడంతో ఆమె ఏడేళ్ల నుంచి దూరంగా ఉంటోంది. వెంకటాచారి కూడా కొన్నేళ్లుగా కూసుమంచి మండలం నాయకన్‌గూడెంలో ఉంటున్నాడు. అయితే, చారిపై కక్ష పెంచుకున్న గిరిధర్‌రెడ్డి హత్య చేయించాలని నిర్ణయించుకున్నాడు. గిరిధర్‌రెడ్డిపై గతంలో ఉన్న హత్య కేసు విచారణ నిమిత్తం కోర్టుకు వెళ్లినప్పుడు సూర్యాపేటకు చెందిన బూసిగంపల సతీష్ పరిచయమయ్యాడు. దీంతో వెంకటాచారి హతమార్చాలని చెప్పడంతో ఒప్పుకున్నాడు. ఆయన తన స్నేహితులు మాతంగి మధు, మాతంగి చెవుల నరేష్‌ను పరిచయం చేయగా ముగ్గురికి రూ.5లక్షల చొప్పున సుపారీ ఇవ్వడంతో కోర్టు ఖర్చులు భరించేందుకు గిరిధర్‌రెడ్డి ఒప్పందం కుదుర్చుకున్నాడు.

ఆన్‌లైన్‌లో కారు బుక్ చేసుకుని...

ఈనెల 17న హైదరాబాద్ వెళ్లిన సతీష్ లాంగ్‌డ్రైవ్ యాప్ ద్వారా కారు బుక్ చేసుకుని వచ్చాడు. సూర్యాపేటలో రెండు కొబ్బరి బొండాలు నరికే కత్తులు కొనుగోలు చేసి మధు, నరేష్‌తో ఈనెల 19నుంచి వెంకటాచారిని హతమార్చేందుకు ప్రయత్నిస్తున్నా కుదరలేదు. చివరకు 23వ తేదీన నరేష్ బైక్‌పై వచ్చి వెంకటాచారి ఇంటి నుంచి ఆయనను అనుసరిస్తూ మిగతా ఇద్దరికి ఫోన్‌లో చెప్పగా వారు కారులో వచ్చి వెంకటాచారి బైక్‌ను ఢీకొట్టగా కింద పడ్డాడు. దీంతో సతీష్, మధు చెరో కత్తితో ఆయన మెడపై పొడిచి హత్య చేసి పారిపోయారు. ఈ కేసు దర్యాప్తునకు రంగంలోకి పోలీసులు ఆదివారం నేలకొండపల్లి సెంటర్‌లో వాహనాల తనిఖీ చేస్తుండగా ఆటోలో వచ్చిన నలుగురు వ్యక్తులు పారిపోతుండగా అదుపులోకి తీసుకుని విచారించారు. దీంతో వెంకటాచారి హత్య చేసింది తామేనని ఒప్పుకోవడంతో గిరిధర్‌రెడ్డి, సతీష్, మధు, నరేష్ నుంచి కారు, కత్తులు, బైక్ సీజ్ చేశామని ఏసీపీ తెలిపారు. కాగా, గిరిధర్‌రెడ్డిది మొదటి నుంచి నేరప్రవృత్తేనని, ఆయనపై ఇదివరకే మూడు హత్యకేసులు, ఒక వేధింపుల కేసు నమోదయ్యాయని చెప్పారు. దీంతో 2017 నుంచి మే 2022 వరకు సస్పెండ్‌లో ఉన్నాడని తెలిపారు. అయితే, వివాహేతర సంబంధం నేపథ్యంలోనే హత్య జరిగిందనే ప్రచారంలో ఎలాంటి వాస్తవం లేదని, ఇందుకు ఆధారాలు లభించలేదని ఏసీపీ స్పష్టం చేశారు. ఈ సమావేశంలో కూసుమంచి సీఐ కంది జితేందర్‌రెడ్డి, కూసుమంచి, తిరుమలాయపాలెం ఎస్సైలు రమేష్‌కుమార్, శ్రీనివాస్ పాల్గొన్నారు.


హత్య కేసు వివరాలు వెల్లడిస్తున్న ఖమ్మం రూరల్ ఏసీపీ బస్వారెడ్డి


నిందితుల నుంచి స్వాధీనం చేసుకున్న కారు, బైక్